ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 11-12.2025 సమయం: 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలో మొదటి విడత పంచాయతీ ఎన్నికలు ఈ రోజు ప్రశాంతంగా ముగిశాయి. ఆయా జిల్లాల్లో గ్రామాల వారీగా ఫలితాలు వెలువడుతున్నాయి.

2. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాల విడిదికి ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సంబంధిత అధికారులను ఆదేశించారు.

3. యువ పరిశోధకులు శాస్త్రీయ అధ్యయనాలపై దృష్టి సారించాలని నాణేల అధ్యయనం, వారసత్వ అధ్యయనాల్లో తెలంగాణ ముందంజలో నిలవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు.

4. రాష్ట్రంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా 3 నుంచి 4 డిగ్రీల వరకు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలియజేసింది.

-------------------------------

**తొలి విడత పంచాయతీ ఎన్నికలు**

రాష్ట్రంలో ఈ రోజు జరిగిన పంచాయతీ ఎన్నికల తొలి విడత పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్.. మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగింది. అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు మొదలు పెట్టారు. పలు జిల్లాల్లోని గ్రామ పంచాయతీల్లో ఓట్ల లెక్కింపు పూర్తై ఫలితాలు వెలువడ్డాయి. ఆయా గ్రామాల్లో ఉప

సర్పంచ్ పదవుల ఎన్నిక ప్రక్రియ కొనసాగుతోంది. ఈరోజు 3వేల 834 సర్పంచి.. 27వేల 628 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరిగాయి. కాగా మధ్యాహ్నం ఒంటి గంట వరకు 79.15 శాతం పోలింగ్ నమోదైనట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రాథమికంగా ప్రకటించింది. ఆ తర్వాత కూడా క్యూలైన్ లో ఉన్న వారికి ఓటు వేసే అవకాశం కల్పించారు.

**జీఎస్**

-------------------------------------

**రాష్ట్రపతి:**

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్ శీతాకాల విడిదికి అన్ని ఏర్పాట్లూ ముందుగానే పూర్తి చేయాలని, వివిధ విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్రపతి ఈనెల 17 నుంచి 22 వరకు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో విడిది చేస్తారు. ఈ పర్యటన నేపథ్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్ల పై ఆయన సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షించారు. హైదరాబాద్ సమీపంలోని ఫిలిం సిటీలో జరిగే రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ ల సదస్సులో రాష్ట్రపతి పాల్గొంటారు. గచ్చిబౌలిలోని బ్రహ్మ కుమారీస్ సంస్థ కార్యక్రమంలో కూడా రాష్ట్రపతి ఈ పర్యటనలో పాల్గొంటారు. ఈ సమీక్షా సమావేశంలో డీజీపీ శివధర్ రెడ్డి, రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, హోమ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సి.వీ ఆనంద్, హైదరాబాద్ నగర పోలీస్ కమీషనర్ వీసీ సజ్జనార్, GHMC కమీషనర్ ఆర్.వి.కర్ణన్, ప్రొటోకాల్ డైరెక్టర్ శివలింగయ్య సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**MSL**

-------------------------------

**తెలంగాణ విజన్ డాక్యుమెంట్**

ఇటీవల గ్లోబల్ సమ్మిట్ లో విడుదల చేసిన తెలంగాణ విజన్ డాక్యుమెంట్ రాష్ట్ర భవిష్యత్ ముఖ చిత్రాన్ని ఆవిష్కరించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ అభినందనలు తెలిపారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి ఈ ఉదయం వారిని కలిసిన సందర్భంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్

విజయవంతమైన తీరుపై, వారి మధ్య చర్చ సాగింది. సమ్మిట్‌లో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు రాబట్టేందుకు ఒప్పందాలు చేసుకోవడంపై అగ్ర నేతలు సీఎంను ప్రశంసించారు.

**డెస్క్**

---------------------------

**భట్టి విక్రమార్క**

యువ పరిశోధకులు శాస్త్రీయ అధ్యయనాలపై దృష్టి పెట్టాలని, నాణేల అధ్యయనం, వారసత్వ అధ్యయనాల్లో తెలంగాణ ముందంజలో నిలవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆకాంక్షించారు. వారసత్వ ఆధారిత పరిశోధనకు తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. ఈ రోజు హైదరాబాద్ లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల విభాగంలో దక్షిణ భారతదేశ నాణేలు మరియు ఆర్థిక వ్యవస్థ అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.... మన రాష్ట్రాన్ని శాస్త్రీయ అధ్యయనం, సంస్కృతి సంరక్షణ, జ్ఞాన ఉత్పత్తిలో కేంద్రీకృత హబ్‌గా తీర్చిదిద్దడంలో రాష్ట్ర ప్రభుత్వం దృఢసంకల్పంతో ఉందని ఆయన తెలిపారు. కాగా ఈ సదస్సు రెండు రోజుల పాటు జరగనుంది.

**జీఎస్**

----------------------------

**శ్రీధర్ బాబుకు ఆహ్వానం**

వచ్చే ఏడాది జూలై 31 నుంచి ఆగస్టు 2 వరకు జరగనున్న అమెరికన్ తెలుగు 19వ మహాసభలు–యువజన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరుకావాలంటూ ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబుకు అహ్వానం అందింది. ఈ మేరకు ఆటా అధ్యక్షుడు జయంత్ చల్లా, ఎలెక్ట్ ప్రెసిడెంట్ సతీష్ రెడ్డి, మీడియా కోఆర్డినేటర్ ఈశ్వర్ బండా ఈ రోజు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. అలాగే ఆటా చేపడుతున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 19న హైదరాబాద్ టీ-హబ్‌లో నిర్వహించనున్న బిజినెస్ సెమినార్‌కు కూడా ముఖ్య అతిథిగా హాజరు కావాలని మంత్రి శ్రీధర్ బాబును కోరారు.

**జీఎస్**

-------------------------------

**మంత్రి దామోదర్ రాజనర్సింహ్**

కార్పోరేట్ ఆసుపత్రులకు ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధునిక వైద్యసేవలను అందిస్తున్నామనీ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ్ అన్నారు. ఈ రోజు సంగారెడ్డిలో జరిగిన ఒక కార్యక్రమానికి హాజరైన మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం విద్య , వైద్య రంగాలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందన్నారు .

**SANGAREDDY. PTC**

-------------------------

**OU**

ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇక మీదట సరికొత్తగా మారనుంది. ఈ విశ్వవిద్యాలయాన్ని స్టాన్‌ఫర్డ్, ఆక్స్‌ఫర్డ్ వర్సిటీలకు దీటుగా తయారుచేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేసినట్లు చెబుతున్నారు. రాష్ట్ర చరిత్రలో అంతర్భాగమైన విశ్వవిద్యాలయం భవిష్యత్తు తరాలకు మరింతగా ఉపయోగపడాలని ఆయన అధికారులను ఆదేశించారు. మూడు నెలల్లో వెయ్యి కోట్ల రూపాయలు ఇస్తామని, భవనాలతో పాటు అద్భుతమైన ప్రయోగశాలలను నిర్మించాలని సూచించారు.

**Desk**

------------------------

రేవంత్ రెడ్డి నివాళులు

దశాబ్దాల పాటు ప్రజాసేవకు అంకితమైన గొప్ప నాయకుడు దివంగత రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ.. అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. ప్రణబ్ ముఖర్జీ జయంతి సందర్భంగా.. ఢిల్లీలో రేవంత్ రెడ్డి.. ప్రణబ్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా.. ప్రణబ్ ముఖర్జీ దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

**జీఎస్**

-------------------------------

**బీజేపీ**

బీజేపీ నాయకుడు మర్రి శశిధర్ రెడ్డి నేతృత్వంలో ఆ పార్టీ ప్రతినిధుల బృందం ఈరోజు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ను కలిశారు. ఈ సందర్భంగా GHMC వార్డుల విభజనకు సంబంధించిన గెజెట్ నోటిఫికేషన్‌పై పారదర్శకత కోరుతూ, సంబంధిత సమస్యలపై చర్చించారు.

**పీఎస్**

-----------------------------------

**ఫోన్ ట్యాపింగ్ కేసు**

ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న మాజీ ఐపీఎస్ అధికారి ప్రభాకర్‌రావు దర్యాప్తు అధికారి ఎదుట హాజరుకావాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. ప్రభాకర రావు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్.మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం.. ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. కస్టోడియల్ దర్యాప్తునకు సిట్‌కు అనుమతిచ్చిన ధర్మాసనం.. ప్రభాకర్‌రావుకు భౌతికంగా ఎలాంటి హాని జరగకుండా చూడాలని స్పష్టం చేసింది.

**డెస్క్**

---------------------------

**వాతావరణం**

రాష్ట్రంలో రాబోయే రెండు మూడు రోజుల్లో కనిష్ఠా ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా 3 నుంచి 4 డిగ్రీల వరకు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలియజేసింది. ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, వరంగల్, హన్మకొండ, మహబూబాబాద్,జనగాం, సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో మూడు రోజుల పాటు చలి గాలులు విస్తాయని పసుపు రంగు హెచ్చరికను జారీ చేసింది.

**పీఎస్**

-----------------------------

**ఇండిగో ప్రకటన**

కొన్ని రోజుల నుంచి తీవ్ర సంక్షోభంలో చిక్కుకుపోయిన దేశీయ విమానయాన సంస్థ ఇండిగో.. పూర్తిస్థాయిలో కార్యకలాపాలను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలియజేసింది. ఈ రోజు 1950కి పైగా సర్వీసుల్లో మూడు లక్షల మంది ప్రయాణించనున్నారని వెల్లడించింది. అదే సమయంలో సర్వీసుల రద్దు కారణంగా ఇబ్బంది పడిన ప్రయాణికులకు పరిహారం కింద 10 వేల రూపాయల విలువైన ప్రయాణ బహుమతులు అందజేస్తామని తెలిపింది. ఏడాది లోగా ఇండిగో ప్రయాణంలో వాటిని వాడుకోవచ్చని తెలిపింది.

**జీఎస్**

--------------------------

**పర్యాటకం**

పర్యాటకులు, సృజనాత్మకదారులను ప్రోత్సహించేందుకు '100 వీకెండ్ వండర్స్ ఆఫ్ తెలంగాణ' పోటీలను రాష్ట్ర పర్యాటక శాఖ నిర్వహిస్తోంది. ఈ పోటీల ద్వారా అరుదైన ప్రాంతాల అందాలు, ఇప్పటి వరకు వెలుగులోకి రాని ప్రాంతాలు, వారాంతపు ప్రదేశాలను ఫొటోలు, వీడియోల రూపంలో పరిచయం చేయాలని ఆహ్వానించింది. ప్రకృతి, వన్య ప్రాణులు, కళలు-సంస్కృతి, వారసత్వ ప్రదేశాలు, జలవనరులు, వంటకాల అనుభవాలు, గ్రామీణ-వ్యవసాయ పర్యటనలు, రిసార్టులు, ఆధ్యాత్మిక ప్రాంతాలు, సాహసోపేత ప్రదేశాలు వంటి పలు విభాగాల్లో పాల్గొనవచ్చు. ఇందులో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా 50 వేల రూపాయలు, రెండో బహుమతిగా 30 వేల రూపాయలు, మూడో బహుమతిగా 20 వేల రూపాయలు, మరో పది కన్సొలేషన్ బహుమతులు అందించనున్నారు. పూర్తి వివరాలకు రాష్ట్ర టూరిజం వెబ్‌సైట్‌ను సందర్శించాలని పర్యాటక శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది.

**డెస్క్**

----------------------------

అశ్వినీ

తెలంగాణకు మంజూరు చేసిన 63 ఆర్‌ఓబీల్లో 17 నిర్మాణాలు రాష్ట్ర ప్రభుత్వం కారణంగానే ఆలస్యమైనట్లు కేంద్ర రైల్వేమంత్రి అశ్వినీవైష్ణవ్ తెలిపారు. భూసేకరణ కారణంగా 16, ఫైనల్ అలైన్‌మెంట్ ఖరారులో జాప్యంతో 1 ఆలస్యమైనట్లు చెప్పారు. లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో నిన్న ఒక ప్రశ్నకు సమాధానంగా కేంద్ర మంత్రి ఈ సమాచారం ఇచ్చారు.

**డెస్క్**

------------------------

**పర్వతాల దినోత్సవం**

ఈరోజు అంతర్జాతీయ పర్వత దినోత్సవం. ప్రతి సంవత్సరం డిసెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా దీనిని జరుపుకుంటారు, పర్వతాల ప్రాముఖ్యత, పర్వత ప్రాంత ప్రజల జీవనోపాధి, పర్యావరణ పరిరక్షణ గురించి అవగాహన పెంచడం దీని ముఖ్య ఉద్దేశ్యం.; ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ ఈ దినోత్సవాన్ని 2002లో ప్రకటించింది.  ఐక్యరాజ్యసమితి ఆహార, వ్యవసాయ సంస్థ (FAO) దీని వేడుకలను సమన్వయం చేస్తుంది. పర్వతాలు అందించే నీరు, ఆహారం వంటి సహజ వనరుల గురించి అవగాహన కల్పించడం, పర్వత ప్రాంతాల అభివృద్ధి, పర్యావరణ సమస్యలపై దృష్టి పెట్టడం దీని ప్రధాన ఉద్దేశ్యం.

**జీఎస్**

--------------------------------